మహిళలు స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి పెట్టాలి

నావంతు సహాయ సహకారాలను అందిస్తా
మున్సిపాలిటీ ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం
మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి
వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ

విశ్వంభర, అందోల్: మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే స్వయం ఉపాధిని పొందేందుకు మార్గాలను ఎంచుకోవాలని, ఇందుకు అవసరమైన సాకారాన్ని అందిస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ భరోసానిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా అందోలు--జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో మహిళలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అందోలు--జోగిపేట మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి పనులను జరుగుతున్నాయని, కానీ వాటి వలన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తమకు లభించడం లేదని, అందోలులో కూరగాయాల మార్కెట్ (సంత) లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఆర్టీసీ బస్సులు కూడా అపడం లేదని వారు ఆయన ముందు ప్రస్తావించారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు వ్యాపార రంగాలపై దృష్టి పెట్టాలన్నారు. డ్రై క్లినింగ్ సెంటర్లు, టైలరింగ్, ఎంబ్రాయిడర్ వర్కింగ్, కూరగాయాలు దుకాణాలు వంటి వాటిని ఏర్పాటు చేసుకునేందుకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని ఆయన హామీనిచ్చారు. సంగుపేట చౌరస్తా వద్ద కూరగాయాల మార్కెట్ ఏర్పాటుకు షెడ్‌ను ఏర్పాటు చేస్తానని తెలిపారు. అంతేకాకుండా యువతీ, యువకులకు ఉద్యోగాల కల్పనకు పరిశ్రమల ఏర్పాటు చేయిస్తానని ఆయన తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫేడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు గజ్జడ కిషన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, ఆర్.ప్రదీప్‌గౌడ్, హరికృష్ణాగౌడ్, డి.శివశంకర్, తోట్ల రామకృష్ణ నాయకులు శ్రీనివాస్ యాదవ్, సురోత్తమ్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన శిక్షణ విమానం.. పైలట్లు సురక్షితం!

విశ్వంభర, నేషనల్ బ్యూరో: కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఆదివారం ఒక శిక్షణ విమానం ప్రమాదానికి గురైంది. బాబలేశ్వర్ తాలుకాలోని మంగళూరు గ్రామ శివార్లలో ఈ విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్‌తో సహా మరో వ్యక్తి స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ విమానం కలబురగి నుంచి బెళగావికి వెళ్తుండగా మంగళూరు గ్రామం వద్ద ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి నేలకొరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విమానంలోని ఇద్దరినీ సురక్షితంగా బయటకు తీసి, చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇంజన్ వైఫల్యం లేదా వాతావరణ పరిస్థితులవల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మావోయిస్టు సాంబశివుడి తల్లి మృతి

విశ్వంభర, నల్లగొండ: మాజీ మావోయిస్టు పార్టీనేత సాంబ శివుడి తల్లి కొనపురి లక్ష్మమ్మ మృతిచెం దారు. గతకొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆమె.. ఆదివారంతుదిశ్వాస విడిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక రాజకీయ నేతలు, సాంబశివుడి అభిమానులు లక్ష్మమ్మ మృతికి సంతాపం తెలుపుతున్నారు. కాగా, కొనపురి సాంబశివుడు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ మాజీ మావోయిస్టు అగ్రనేత, టీఆర్ఎస్ (ప్రస్తుత బిఆర్ఎస్) పార్టీ నాయకుడు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. దాదాపు 16 ఏళ్ల పాటు విప్లవోద్యమంలో పనిచేసి మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్య దర్శిగా కూడా పనిచేశారు. ఆ తర్వాత మావోయిస్టు కర్ణాటక రాష్ట్ర కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. కర్ణాటక రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలోనే ఆయన 2009లో అప్పటి హోంమంత్రి జానారెడ్డి సమక్షంలో లొంగిపోయారు. నాటి టీఆర్ఎస్ పార్టీలో చేరి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. అనంతరం నయీం ముఠా చేతిలో హత్యకు గురయ్యారు. సాంబశివుడి హత్య తర్వాత కొన్నాళ్లకు ఆయన సోదరుడు కొనపురి రాములును కూడా నయీమ్ ముఠా హత్య చేసింది.

నేటి నుండి టీజీ ఈసెట్ దరఖాస్తులు ప్రారంభం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ ఈసెట్ ధరఖాస్తులు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 18 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించేర ఈ పరీక్షకు సంబంధించి ఈ నెల 9 న ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం కానుంది. ఏప్రిల్ 18 వరకు ఆలస్య రుసుము లేకుండా ధరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో మే 15 న ఈ పరీక్షను నిర్వహించనున్నారు. డిప్లొమా, బీఎస్సీ (మ్యాథమెటిక్స్) పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో రెండో సంవత్సరంలోచేరవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ. 500, ఇతర అభ్యర్థులందరికీరూ.900గా నిర్ణయించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను కేవలం ఆన్‌లైన్ ద్వారానే సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://ecet.tgche.ac.in ను సందర్శించవచ్చు లేదా 8179979584 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఆన్‌లైన్ గేమింగ్.. రూ.5వేల కోట్ల భారీ కుంభకోణం

ముంబయి టు హైదరాబాద్ ముప్పేట దాడులు.. కీలక ఆధారాల సేకరణ



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ఆన్‌లైన్ గేమింగ్ ముసుగులో సాగుతున్న ఒక భారీ 'సిండికేట్' గుట్టును హైదరాబాద్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు రట్టు చేశారు. ఏకంగా రూ.5,000 కోట్ల విలువైన ఈ అక్రమ సామ్రాజ్యంపై దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఈ భారీ నెట్‌వర్క్‌ను నడిపిస్తున్న ప్రధాన సూత్రధారులుగా ముంబయికి చెందిన వైఎస్ ప్రభుకుమార్, హైదరాబాద్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డిని అధికారులు గుర్తించారు. వీరిద్దరూ కలిసి దేశవ్యాప్తంగా ఒక పకడ్బందీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి, గత కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా ఈ అక్రమ కార్యకలాపాలను సాగిస్తున్నట్లు విచారణలో తేలింది.

పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం.. ఒకేసారి మూడు ప్రధాన నగరాల్లో సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ నగరాల్లో నిర్వహించిన సోదాల్లో భారీ ఎత్తున జీఎస్టీ ఎగవేతకు సంబంధించిన పత్రాలు, అక్రమ లావాదేవీల రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వేల కోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతున్నా, పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న తీరును చూసి అధికారులు సైతం విస్మయానికి గురయ్యారు. కేవలం గేమింగ్ మాత్రమే కాకుండా, ఈ లావాదేవీల వెనుక మనీ లాండరింగ్ కోణాలు కూడా ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందని, త్వరలోనే మరిన్ని కీలక వివరాలు, అలాగే ఈ సిండికేట్‌లో భాగస్వాములుగా ఉన్న ఇతర వ్యక్తుల పేర్లు బయటపెడతామని అధికారులు వెల్లడించారు.

జానారెడ్డి, కోమటిరెడ్డిని తొక్కుకుంటూ వచ్చావా?
సీఎం రేవంత్‌పై మాజీ ఎమ్మెల్సీ ఫైర్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలి తాము కోరుకుంటున్నామని.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రశ్నిస్తున్నామని.. తాము ప్రశ్నిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం బూతు పురాణం మొదలు పెట్టారని శాసనమండలి మాజీ విప్ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 700 రోజులైనా సీఎంలో మార్పు రాలేదన్నారు. తమను తిడుతూ రాక్షసానందం పొందుతున్నారని.. ఓ తీవ్రవాదిగా మారారని అన్నారు. తన గురువు రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారని.. రాష్ట్రం రావణ కాష్టం కావాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పెద్దలు జానారెడ్డి, జీవన్‌రెడ్డి, హన్మం తరావులాంటి వారు స్పందించాలన్నారు. రేవంత్ మానసిన రోగిలా మారారని.. జనాన్ని కరిచేలా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయనను డాక్టర్‌కు చూపించాలన్నారు. హార్వర్డ్ పోయి వచ్చాక మారుతారని భావించామని.. కాంగ్రెస్‌ను ఆయనే బొందపెట్టేలా ఉన్నారని ఆరోపించారు. మిర్యాలగూడ సభలో జానారెడ్డిని ఫ్యూడల్ నాయకుడని రేవంత్ అన్నారని.. తాను అందరినీ తొక్కుకుంటూ వచ్చానని స్వయంగా చెప్పారని.. అంటే జానారెడ్డి, జీవన్‌రెడ్డి, కోమటిరెడ్డిని తొక్కుకుంటూ వచ్చావా..? అని ప్రశ్నించారు. ఇప్పుడు రేవంత్ చేష్టలతో కాంగ్రెస్ 50 ఏండ్లు వెనక్కిపోయిందన్నారు. సీఎం అధికారిక సభలు పెట్టి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని.. రాష్ట్ర ఎన్నికల సంఘం సభలపై తేల్చాలని డిమాండ్ చేశారు.

చైతన్య శ్రీనివాస్ రెడ్డి గెలుపు చారిత్రాత్మకం కావాలి

ఫిబ్రవరి 11న 'హస్తం' గుర్తుకే ఓటు వేయాలని పిలుపు
అభివృద్ధి యజ్ఞంలో భాగస్వాములు కావాలి
మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: నల్లగొండ పట్టణ ముఖచిత్రాన్ని మార్చేసి, దానిని ఒక సాదాసీదా పట్టణం నుండి అంతర్జాతీయ స్థాయి వసతులున్న 'మహానగరంగా' తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. అభి వృది పై తన విజన్‌ను తెలిపారు. నల్లగొండ సమగ్ర అభివృద్ధి కోసమే మున్సి పాలిటీని కార్పొరేషన్‌గా మార్చుకున్నామని మంత్రి గుర్తుచేశారు. ఈ అభి వృద్ధి యజ్ఞంలో ప్రజల భాగస్వామ్యం చారిత్రాత్మకం కావాలని కోరారు. నల్లగొండ కార్పొరేషన్ పీఠంపై మొదటి మహిళా మేయర్‌గా చైతన్య శ్రీనివాస్ రెడ్డి చరిత్ర సృష్టించబోతున్నారని తెలిపారు. ప్రజా సమ స్యల పరిష్కారమే శ్వాసగా బతికే బుర్రి శ్రీనివాస్ రెడ్డి, చైతన్య దంపతుల సేవలు నగరానికి ఎంతో అవసరమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.. పార్టీ కార్యకర్తలకు సముచిత స్థానం..

పార్టీ కోసం నిరంతరం శ్రమించే నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తగిన గుర్తింపు ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భరోసా ఇచ్చారు. అందులో భాగంగానే సీనియర్ నాయకులు గుమ్ముల మోహన్ రెడ్డికి త్వరలోనే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కబోతోందని కీలక ప్రకటన చేశారు. ఈనెల 11న జరిగే పోలింగ్‌లో 32వ డివిజన్ ప్రజలు ఏకతాటిపై నిలబడి, బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిని రికార్డు స్థాయి మెజారిటీతో గెలిపించాలని మంత్రి పిలుపునిచ్చారు.

తెలంగాణలో మద్యం దుకాణాలు బంద్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలనేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలలో 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి 11వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. అదేవిధంగా ఫలితాల నేపథ్యంలో 13వ తేదీన కూడా వైన్స్, బార్లు బంద్ ఉండనున్నారు. ఈ ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే.. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో ఆయా మునిసిపాలిటీలలో ప్రచారం ఊపందుకుంది. ప్రచారానికి రేపు ఒక్క మాత్రమే గడువు ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. కరపత్రాలు తయారు చేసుకొని ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే ఏకంగా ఓటర్ల కాళ్లకు మొక్కుతూ వేయాలని వేడుకుంటున్నారు. ఒకసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సోనియా గాంధీ, నరేంద్ర మోడీ కుమ్మక్కు అయ్యారని అనుకోమంటారా ?

సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సూటి ప్రశ్న

విశ్వంభర, హైదరాబాద్:

ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ కుమ్మక్కు అయ్యారు అని చెప్పవచ్చా..? అని మాజీ ఎం.పీ. బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు.నేషనల్ హెరాల్డ్ అవినీతిపై కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఈ.డీ, సీ.బీ.ఐ. విచారిస్తున్నాయి . రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇంతవరకు అరెస్టులు జరగలేదు విచారణ ముగించిన తరువాత నేర అరపొనులు ఉంటేనే చటం ప్రకారంగా చెర్యలు ఉంటాయా మోడీ, సోనియా ఇద్దరు కుమ్మక్కు అయ్యారని నేను చెప్పగలను. కానీ నేను చెప్పను. ఈ అంశం విచారణ దశలో ఉన్నప్పుడు వ్యాఖ్యలు ఎవరూ చేయకూడదు. న్యాయ సూత్రాలు తెలిసిన నేను బాధ్యతతో వ్యవహారం చేస్తాను అని తెలిపారు.బాధ్యతాయుతమైన పదివిలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లీగల్ అంశాలను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్త మాట్లాడితే బాగుంటుంది. నోటికి వచ్చినట్లు, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే బాగుండదు అని వినోద్ కుమార్ పేర్కొన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు అంశంపై నియమితులైన ఘోష్ కమిటీ నివేదికపై బి.ఆర్.ఎస్. పార్టీ అధినేత కేసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ఐ.ఏ.ఎస్. అధికారులు, ఇంజనీర్లు తమపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం నుంచి 'స్టే' తీసుకున్నారు. ఇది అందరికి తెలిసిన విషయం. కాలేశ్వరం కేసు విచారణలో ఉన్నప్పుడు ఎలా అరెస్ట్ చేస్తారు?బీఆర్ఎస్ బీజేపీ కుమ్మక్కు అయ్యారు అని కేసీఆర్ పై సిబిఐ విచారణ జరగడం లేదని అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన రాజకీయ ఆరోపణ మాత్రమే .

రాష్ట్రంలో కాంగ్రెస్ ఖేల్ ఖతం దుకాణ్ బంద్: ఎంపీ వద్దిరాజు

విశ్వంభర, పాల్వంచ: రాష్ట్రంలో కాంగ్రెస్ దుష్టపాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డా యని, వాళ్ల ఖేల్ ఖతమై, దుకాణం బంద్ కావడం తథ్యమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్లు హామీలిచ్చి,తీరా అధికారం చేపట్టాక నెరవేర్చకుండా మోసం చేస్తున్నారన్నారు. కొత్తగూడెం 39వ డివిజన్ పాల్వంచ చాకలి బజార్,గాంధీనగర్ సబ్ స్టేషన్ రోడ్, టీచర్స్ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం ఎంపీ రవిచంద్ర మండుటెండను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ రవిచంద్రతో పాటు మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు,ఆయన కుమా రుడు రాఘవ, మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ, విజయ్ తదితరులు డివిజన్ అభ్యర్థి గోవాడ గుణచరిత్ కు ఘన విజయం చేకూర్చాల్సిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భం గా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు చేసిన వాగ్దానాలను నమ్మిన ప్రజలు ఇప్పుడు ఘోస పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.డబ్బులతో ఓట్లు దండుకునేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకుల ముఖం మీద బాకీ కార్డులు విసిరేసి ఇచ్చిన హామీల గురించి నిలదీయ మని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.ఖమ్మం జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు అభివృద్ధి పనులు,ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి కాలక్షేపం చేస్తున్నారని ఎంపీ రవిచంద్ర విమర్శించారు.కాంగ్రెస్ నాయకులకు ప్రజల పట్ల భక్తి లేదని,ప్రజలంటే భయం లేదని,ఈ మునిసిపల్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ పోరులో కూడా భంగపాటు తప్పదని ఎంపీ రవిచంద్ర చెప్పారు.వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అఖండ విజయం సాధించి కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ ఖతం అవ్వడం తథ్యమని ఎంపీ వద్దిరాజు ధీమాగా చెప్పారు.

నగర చరిత్రలో తొలిసారిగా 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలు: సీపీ సజ్జనార్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన 1,446 మంది పోలీసు సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం రివార్డులు అందజేశారు. నగర పోలీసు చరిత్రలో తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలతో పాటు 'గుడ్ వర్క్ డన్' రివార్డులను పోలీస్ సిబ్బందికి ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రదానం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను అభినందిస్తూ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ప్రసంగం చేశారు. పోలీసు వృత్తి కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. విధులకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ప్రతి పనిలోనూ సృజనాత్మకత, మానవీయత ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. అప్పగించిన పనిని పూర్తి చేయడం కంటే, బాధితులకు ఎంతటి భరోసాను కల్పించామన్నదే అసలైన విజయమని స్పష్టం చేశారు. విధులకు అతీతంగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించినప్పుడే పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. సిబ్బందిలో ఉన్న అసాధారణ ప్రతిభను, వినూత్న ఆలోచనలను, విధులకు అతీతమైన సేవలను గుర్తించి, గౌరవించాలనే ఉద్దేశంతోనే కమిషనరేట్ చరిత్రలోనే తొలిసారిగా 'ఎక్స్‌ట్రా మైల్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. విధులకు అతీతంగా సమాజానికి మేలు చేసే ప్రతి పోలీసు అధికారిని ఈ వేదిక గౌరవిస్తుందని చెప్పారు. ఇది కేవలం ఒక అవార్డు మాత్రమే కాదని, అంకితభావానికి దక్కిన గుర్తింపు అని అన్నారు. ఈ గుర్తింపు పోలీసుల్లో నూతనోత్తేజాన్ని నింపుతుందని, ఇతరులు నిబద్ధతతో పనిచేసేలా ప్రేరణనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సాంకేతికత ఎంత పురోగమించినా, క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది చూపే చిత్తశుద్ధికి, ఆపదలో ఉన్న వారి పట్ల ప్రదర్శించే మానవత్వానికి ఏ టెక్నాలజీ సాటిరాదని గుర్తు చేశారు. హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరూ ఒకే బృందంగా పనిచేయడం వల్లే నగరంలో శాంతిభద్రతలు సమర్థంగా ఉన్నాయని కొనియాడారు. ఈ పురస్కారాలు ఇక్కడితో ఆగిపోవని, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపేందుకు ఇకపై ప్రతి నెల జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్‌హెచ్ఓలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేస్తామని తెలిపారు. పోలీస్ సిబ్బంది కృషి, నిజాయితీ వృథా కాదని, కష్టానికి తగ్గ గుర్తింపు కచ్చితంగా ఉంటుందన్నారు. కాగా, గత ఆర్థిక ఏడాదికి

సంబంధించిన 2, 3, 4వ త్రైమాసికాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఎక్స్ ట్రా మైల్ లో భాగంగా విధి నిర్వహణలో విధులకు అతీతంగా సేవలందించిన 271 మందికి ఈ పురస్కారం దక్కింది. గుడ్ వర్క్ డన్ లో భాగంగా విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 1,175 మందికి ఈ రివార్డులు వరించాయి. పురస్కారాలు అందుకున్న వారిలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు.

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మున్సిపాలిటీలో నాలుగవ రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా 12వ వార్డులో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, లక్షెట్టిపేట మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్వెదిరె యోగేశ్వర్ రెడ్డి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పర్వీన్ సుల్తానా ఆరిఫ్తో కలిసి వార్డులో ఇంటింటా తిరిగి ప్రజలను కలుసుకుని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ--అభివృద్ధి కార్యక్రమాలను వివరించి మద్దతు కోరాం. ప్రజల నుండి విశేష స్పందన లభించింది.